


# తెరవెనుక

ఉషశ్రీ

సాయంకాలం అవుతోంది.

సూర్యుడు పడమటికొండమీద ఎర్ర ముగ్గులు దిద్దుతున్నాడు.

బారులుతీరి పక్షులు గూళ్ళకి చేరుతున్నాయి; దారితప్పిన కొంగ రోస్తూ మళ్ళీ తన బారులో చేరుతోంది.

గాలి చల్లగా కదులుతోంది; కార్తీక సంధ్యాకాంతులలో వచ్చే చల్లగాలికి తలలూపే కొత్తిమీర మొక్కలు సువాసన లీనుతున్నాయి. పక్కనే సిగ్గునిండిన పెళ్ళికూతురు బుగ్గలా గులాబీ వికసించే ప్రయత్నంలో ఉంది. కొంచెం ఎడంగా ఉన్న మందారం విరబూసి సంధ్యారాగారుణకాంతులను పరిహసిస్తోంది.

నవ్వుతూన్న మందారాన్నీ. నవ్వబోయే గులాబీ మొగ్గను చూస్తూ, కొత్తిమీర

మడి మీదనుండి వచ్చే వాసనల మత్తుతో ఆలోచనా నిమగ్నుడై కూర్చున్నాడు ఆనందరావు. పడకకుర్చీ ఊగిస లాడిస్తూ, ఆ ఊపుల ఊయెలలో ఉరకలు వేసే ఊహలకు రూపకల్పనచేసి కాగితం మీది కెక్కించడానికి యత్నిస్తోంది. అతని మనస్సు. సుమారుగా రెండే ళ్ళయింది. కలంపట్టి రెండు సంవత్స రాల క్రితం...

* * *

ఆరోజున – యిటువంటి సాయం సంధ్యారుణరోచులు జిమ్మేసమయంలో, ఎలమావితోటలో, నెలవంక కాంతిలో, బంగారు లతవోలె, సింగారముగ నిల్చి సిగ్గుచూపులతోడ, బుగ్గజేర్చినభామ...

పులకించింది ఆనందరావు శరీరం, ఈ ఊహతో...అలా ప్రకాశించి. తన జీవిత భాగస్వామినియై. హృదయేశ్వరిగా నిలిచిన మంజుల....

అంతవరకూ ఊహాసాగరంతో కలం అందుకుని కాగితంమీదికి నడిపించాడు. ఎదురుగా, నందివర్ధనం దగ్గర, కన కాంబరాలు కోసుకుంటున్న మంజుల. ఆయన ఆలోచనలకు అంతరాయం కలిగించకూడ దనుకుంటూ, కొతిమీర మడిమీది వాసనలకు తన్మయంగా ఆస్వా దిస్తూ, ఓరగా చూస్తోంది.

ఆనందరావు కలం కదలడం ఆరం భించింది.

* * *

సాహితీ సదన భవనం కిటకిట లాడుతోంది

నిన్నమొన్న కలంపట్టి వచన పద్యాలు రాసే యువకవులనుండి, తమ మొదటికథపడ్డ పత్రిక చేత్తో పట్టుకుని పదిమందికీ చూసే నవకథకుని వరకూ, ఖండకావ్య రచనలో తలలు పండిన వృద్ధులనుండి, కథా, నవలారచనలో గడితేరిన ప్రముఖులవరకూ సాహితీ ప్రియంభావులందరూ భవనంలోని ఆస నాలు అలంకరిస్తున్నారు. పరస్పర కర స్పర్శలూ, వ్యంగ్య సంభాషణలతో భవనం ప్రతిధ్వనిస్తోంది.

ఆరు గంటలయేసరికి, భవనం అంతా నిండిపోయింది. ఆ భవనంలో జరిగే సమావేశానికి అంతమంది జనం రావడం ఈమధ్య అయిదరేళ్ళ కాలంలో జరగ లేదు. ఎనిమిదేళ్ళ అనంతరం సాహితీ సదనంవారు నిర్వహించిన కథానికల పోటీలో అత్యుత్తమ కథానికగా ఎన్ని కయిన 'అమృతవర్షం' రాసిన సుందర రామారావుకి రెండువేల రూపాయల బహుమతి ప్రధానం చెయ్యడానికి ఏర్పాట యిన సభ అది. పదేళ్ళుగా చక్కని సంసారిక కధలూ, సాంఘిక నవలలూ, ఒకటి–రెండు నాటికలూ రాసి అనేకుల అభినందన లందుకొన్న సుందరరామా రావుకి బహుమతి రావడం అందరికీ ఆనందాన్నే కలిగించింది.

సాహితీ రంగంలో ఉన్న వాదాలతో,

రీతులతో ఏ విధమయిన పేచీ రాకుండా తన మనసుకు నచ్చినవాటిని ప్రశంసించి, నచ్చకపోతే మౌనం వహించే ధోరణికలవాడు కావడంవల్ల రచయితలందరికీ అతనంటే గౌరవం. ఏవర్గంతోనూ చెయ్యి కలపకుండా, ఏ బృందంతోనూ సభ్యత్వం తీసుకోకుండా, తన ఉద్యోగధర్మం నిర్వహించుకుంటూ, హృదయం స్పందించే సంఘటన తటస్థపడినపుడు, ఆ జీవత్ కథకు అక్షరరూపం కల్పించుకుంటూ, రచనా వ్యాసంగం సాగించేవాడు. అటువంటి సుందరరామారావు కథలపోటీలో పాల్గొంటాడని ఎవరూ ఊహించలేదు. పైగా, ఇటువంటి పోటీలకు అతను విముఖుడని కూడా అందరికీ తెలుసు. అయినా అతను పాల్గొని బహుమతిపొందడం అందరికీ ఆశ్చర్యమేకాదు; ఆనందమునూ, కలిగించింది. రెండువేల రూపాయలు చేదా? అని ఇద్దరు, ముగ్గురు హేళన చేసినవారున్నా లేకపోలేదు.

ఆరుగంట లవుతూండగా సుందరరామారావుని కారుమీద సాహితీసదనం కార్యదర్శిగారు తీసుకొచ్చారు. అతను లోపల అడుగుపెడుతూండగానే హర్షధ్వానాలతో కరతాళాలు శ్రుతికలిపాయి.

భవనం మెట్లెక్కుతూ అతను నలువంకలా చూశాడు, పరిశీలనగా చూశాడు. తనను పెద్ద పెద్దలే పలకరించి అభినందిస్తున్నా అతని చూపులు మాత్రం ఎవరినో వెతుకుతూనే ఉన్నాయి. పలకరింపులకు ప్రతిసమాధానాలూ, అభినందనలకు చిరునవ్వుతో కృతజ్ఞతలూ తెలుపుతూ భవనంలోపలకునడిచాడు. అతనికన్నులు ఆసీనులను చూస్తున్నాయి. ఆ కన్నులకు కనబడవలసినవ్యక్తి మాత్రం కనబడడం లేదు. ఎంతో ఆదుర్దాగా చూస్తున్నాడు.

వేదిక ఎక్కవలసినసమయం ఆసన్నమయింది. అప్పటికీ అతని చూపులు వెదుకుతూనే ఉన్నాయి. ఆశతో నిండిన ఆ దృష్టిలో ఆనందం అంకురించడం లేదు. బహుమతిగా వచ్చే రెండువేలకంటె కూడా సాహితీసదనంవారు ఎన్నిక చేయడంవల్ల కలగవలసిన ఆనందం అతని ముఖంలో లేదు. పెదవులు నవ్వుతున్నా ఆ నవ్వులో నవ్వులేదు; కళ్ళల్లో కాంతిలేదు.

వేదిక ఎక్కడమూ అధ్యక్షులపక్క నిలబడుతూండగానే పుష్పమాలాలంకృతుడు కావడమూ జరుగుతున్నా, అతనిదృష్టి ప్రేక్షకులలో ఎవరినో అన్వేషిస్తూనే ఉంది. అతని కన్నులు, మనస్సూ కేంద్రీకృతమయి ఉన్నాయి. ఆ సమయంలో అధ్యక్షులు అతనివైపు చూస్తూ చేసిన అభినందన ప్రసంగం కానీ పోటీలో న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన వారి ఉపన్యాసాలు కాని అతని మనసు కెక్కలేదు. కార్యదర్శి లేచి దుశ్శాలువలు కప్పి, బహుమతి మొత్తం అందిస్తుంటే కూడా అతను పరధ్యానంలో ఉన్నాడు.

అధ్యక్షులు నవ్వుతూ, హెచ్చరించాక ఆ బహుమతి అందుకుని మౌనంగా కూర్చున్నాడు. రెండు, మూడు క్షణాలు సభాస్థలి నిశ్శబ్దంగా ఉంది, అతని ఉపన్యాసం వినడానికి జరిగిన సన్మానికి కృతజ్ఞత తెలపాలనికూడా తోచలేదు. మళ్ళీ అధ్యక్షులు హెచ్చరించారు. అప్పుడు పూలమాల, శాలువలు తీసి, కుర్చీ చేతి మీద ఉంచి లేచి నిలబడి మరో రెండు మూడు నిమిషాలు సభవయిపే కలయజూశాడు. అతని కన్నులలో ఆశ సన్న గిల్లలేదు, ఆనందం వెల్లి విరియలేదు. అంతటి సన్మానం జరుగుతున్నప్పుడుండవలసిన సంతోషంతో అతని హృదయం ఉప్పొంగకపోగా, ఏదో ఆందోళనతోనే ఉంది

అలానే ఏవో రెండుముక్కలు కృతజ్ఞతా సూచకంగా పలికేసి, మొక్కుబడి తీర్చుకున్నాడు. వేదిక దిగుతూండగా ఎందరో పలకరించారు, మరెందరో అభినందించారు, ఇంకెందరో ప్రశంసించారు.

సుందరరామారావు కివేమీ చెవికెక్కడం లేదు ద్వారం ఈవలకు వచ్చి నిలబడ్డాడు. నెమ్మది, నెమ్మదిగా ఒకొక్కరే నిష్క్రమిస్తున్నారు. సాహితీ సదనం కార్యవర్గసభ్యులు కొందరు, ఇద్దరు ముగ్గురు స్త్రీలూ మిగిలారు.

"కారు తెప్పించమంటారా ఆడిగాడు కార్యదర్శి

"ఏవిటంటున్నారూ..." అని దూరంగా నిలబడ్డ స్త్రీలవయిపే చూస్తూ-

"కారుకదూ ... వద్దులెండి. ఒక్కసారి మా తాతయ్యగారింటి కెళ్ళి అక్కడ మా గురువుగారిని చూసి వెడతా" అని, స్త్రీలకేసి అడుగుకదిపాడు. కార్యవర్గంలో నూతనంగా సభ్యత్వం పొందిన మాజీ మంత్రిగారి మేనల్లుడు, హేళనగా నవ్వుతూ,

"కథకులు కాదండీ, కాస్త యువతుల పరిచయం అవసరం," అంటూ మెట్లు దిగేశాడు.

సుందరరామారావుకి వినపడ్డా, అది తెలిసేస్థితిలో కాక, ఆ స్త్రీలను సమీపించి,

"ఏం లలితా, లత రాలేదా " అన్నాడు ఆతురతతో.

"ఎలా వస్తుంది, మేష్టారూ...రెండు వేలుకాదు, అయిదువేలయినా మీరు పోటీకి కథ రాయరని మాతో వాదించి, మీ దగ్గరకు వచ్చింది మీచేత కథ రాయించింది. మీరేమో బహుమతికూడా కొట్టేశారు. మరి మాతో పందెంలో ఓడిపోయింది కదా, ఇప్పుడిక్కడకు వస్తే మేమంతా చప్పట్లుకొట్టం'' అని నవ్వుతూ వెళ్ళిపోయారు వాళ్ళు.

"ఎంతపనిచేసింది లత" అని, నుదుట చెయ్యి వేసుకున్నాడు . ।

కుర్చీ వెనకాల నిలబడి, రాస్తున్న కథంతా చదివిన మంజుల, ఫకాలుననవ్వి.

"రెండేళ్లు పట్టిందా, మన కథ రాయడానికి?" అంది, సిగ్గునిండిన బుగ్గలలో సుడులు తిరిగాయి.